క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం శనివారం సందర్భంగా మహిళలతో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ రకాల పూలు, తులసిఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యోగాసన స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొనండి



కరపత్రాలు విడుదల చేస్తున్న యోగా అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: యోగాసన స్పోర్ట్స్ పోటీల్లో యోగ సాధకులు, ప్రజలు పాల్గొనాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి, మాస్టర్ ఈశ్వరయ్య కోరారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో శనివారం యోగాసన స్పోర్ట్స్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 27న శ్రీసత్యసాయి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పదేళ్ల నుంచి 60 సంవత్సరాల వరకు ఈ పోటీలలో యోగా సాధకులు పాల్గొనవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల చిన్న వెంకటేషులు, కట్టా రవి, ఆదినారాయణ, వెంకటలక్ష్మయ్య, తిరుమలేసు, సాయిప్రసాద్, నాగరాజు, బాబ్‌జాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


వ్యవసాయ గోడౌన్ ప్రారంభం



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి గోవిందు

నల్లమాడ: రాగానిపల్లి సమీపాన నిర్మించిన వ్యవసాయ గోడౌన్‌ను శనివారం మంత్రి సవితమ్మ ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రోన్లు వంటి ఆధునిక టెక్నాలజీని తీసుకొచ్చి వ్యవసాయ ఖర్చులు తగ్గించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం నల్లమాడలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, అన్నదాత సుఖీభవ సాయం రైతులకు వెంటనే అందించాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి గోవిందు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం



చెన్నేకొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలకృష్ణుడు

చెన్నేకొత్తపల్లి: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ బాలకృష్ణుడు పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులతో కలసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమై ర్యాలీ న్యామద్దల సర్కిల్ వద్దకు చేరింది. అక్కడ విద్యార్థులు, అధికారులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఈఓఆర్డీ అశోక్‌నాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ముదిగుబ్బ: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్నం ఎస్ఐ రాజశేఖర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. శనివారం ఆయన పట్నం పోలీస్ స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు ఆటో డ్రైవర్లు తప్పక యూనిఫాం ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రికార్డులను కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలించరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

కియోస్క్ సేవలకు మంగళం

- రైతు భరోసా కేంద్రాల్లో నిరుపయోగంగా పరికరాలు
- కొత్త యాప్‌తో అరకొర సేవలు
- రైతులకు తప్పని ఇబ్బందులు



తనకల్లు-1 సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

తనకల్లు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో గత ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను అటకెక్కిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సైతం ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలొస్తున్నాయి. గత ప్రభుత్వం రైతులు మండల కేంద్రానికి వెళ్లే పని లేకుండా మండలంలో మొత్తం 14 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో కియోస్క్‌లను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, పంటలకు మార్కెటింగ్ మొదలైన సేవలను పొందే అవకాశం కల్పించింది.

దిష్టిబొమ్మల్లా యంత్రాలు..

అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు సైతం ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం కియోస్క్‌లు ఆయా రైతు సేవా కేంద్రాల్లో మూలపడి ఉన్నాయి. దీంతో రైతులు పలు సేవలను పొందలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కియోస్క్‌ల స్థానంలో ప్రభుత్వం కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ యాప్‌లో పూర్తిస్థాయి సేవలు అందడం లేదని రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్క్‌ల సేవలను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

సేవలను కొనసాగించాలి



గత ప్రభుత్వం రైతుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసి కియోస్క్‌ల సేవలను కొనసాగించాలి. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోలుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకోడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడేవి. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. అన్ని రకాల సేవలు రైతు సేవా కేంద్రాల్లో అందేలా చర్యలు తీసుకోవాలి. - హిమధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివాండ్లపల్లి, తనకల్లు మండలం

నిర్లక్ష్యం సరికాదు



ఆర్‌ఎస్‌కేలలోని కియోస్క్‌లను ఉపయోగించుకోకపోవడం సరికాదు. అక్షర జ్ఞానం లేని రైతులను దృష్టిలో ఉంచుకొని రైతు సేవా కేంద్రాలను మరింత ఆధునీకరించి కియోస్క్‌లను వినియోగంలోకి తేవాలి. గతంలో మాదిరిగానే రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు అన్ని వసతులు ఉండాలి.
- రెడ్డెప్ప, సీపీఐ మండల కన్వీనర్, తనకల్లు

రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాం

మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కియోస్క్‌లు చాలా వరకు పని చేయడం లేదు. అయితే మొబైల్ యాప్‌లలో రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందజేస్తున్నాం. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.
- భారతి, ఏఓ, తనకల్లు

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



కనగానపల్లిలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల, గ్రామ కమిటీ సభ్యులు

కనగానపల్లి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కనగానపల్లిలో పార్టీ మండల కన్వీనర్ నాగముని అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల, గ్రామ కమిటీ, అనుబంధ విభాగాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల నియామకంపై చర్చించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరందరిని ఎంపిక చేస్తున్నామన్నారు. వీరంతా కలసికట్టుగా పనిచేస్తూ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేసుకుందామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు అమరనాథరెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, పార్టీ నాయకులు ముక్తాపురం రమణారెడ్డి, మాజీ డైరెక్టర్ ప్రభాకర్, చిన్నపెద్దిరెడ్డి, అంకె గోపాల్, చింతమేకల రవి, ఆలమూరప్ప, లక్ష్మీనారాయణ, వెంకటరామిరెడ్డి, అంకె గోపాల్, విశ్వనాథ్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, రామాంజి, కృష్ణారెడ్డి, రమేష్, పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూర్‌బాషా ముస్లింలకు పెద్దపీట

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీలో నూర్‌బాషా(దూదేకుల) ముస్లింలకు పెద్దపీట వేశారని ఆ సంఘం రాయలసీమ జోన్ కో-ఆర్డినేటర్ మోదిన్ బాషా పేర్కొన్నారు. శనివారం ముదిగుబ్బలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూర్‌బాషాలను ముస్లిం మైనార్టీలుగా గుర్తించాలని ఎన్నో ఏళ్లుగా కోరినా ఏ రాజకీయ పార్టీ పట్టించుకోలేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా ముస్లింలను ముస్లింలలో అంతర్భాగంగా గుర్తించి అవకాశాలు కల్పించిందన్నారు.

మైనార్టీ కోటాలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా షేక్ సయ్యద్‌బాజీకి అవకాశం కల్పించారిన గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు నబీరసూల్, ప్రధాన కార్యదర్శి జమాల్‌బాషా, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతాం



మహాసభలో మాట్లాడుతున్న రాంభూపాల్

కదిరి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో శనివారం ఆ పార్టీ పట్టణ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సమస్యలపై కేంద్రీకరించి పని చేయాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత మహాసభ నుంచి పార్టీ నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలన్నారు. అనంతరం పట్టణ కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణ కార్యదర్శిగా జగన్మోహన్, సభ్యులుగా బాబ్జాన్, సాంబశివ, శంకర్‌రెడ్డి, రామ్మోహన్, ముస్తాక్, శాంతిబాయి, మాబున్నీషా, శివ, హరినాథ్‌రెడ్డిను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఈఎస్ వెంకటేష్, జీఎల్.నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, జెడ్పీ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు



ధర్మవరంలో రిలేదీక్షల్లో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, నాయకులు



పుట్టపర్తిలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ధర్మవరం: కార్మికుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం 24 రోజూ రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సంక్షేమ వర్తింపజేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయుబ్‌ఖాన్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి జయచంద్ర, అనిల్, దస్తగిరి, యోగి, పెద్దన్న, నరసింహులు, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

పుట్టపర్తి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీఓలు జారీ చేయకపోవడం, అప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగార్జున, అధ్యక్షులు నరసింహులు, కోశాధికారి గోవిందు, సహాయ కార్యదర్శి పెద్దన్న, రామయ్య, కార్మికులు వెంకటేష్, రామాంజనమ్మ, సరోజమ్మ, వెంకటలక్ష్మి, నారాయణమ్మ, మారెప్ప, రమణ, సద్దాం, రామాంజినాయక్, సాయినాథ్‌రెడ్డి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటాలు చేస్తాం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న అమీర్‌బాషా

ధర్మవరం: కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమీర్‌బాషా పేర్కొన్నారు. పట్టణానికి చెందిన అమీర్‌బాషాను పార్టీ అధిష్టానం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన విషయం తెలిసిందే. శనివారం ఆయన పట్టణంలోని కేతిరెడ్డి నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. యూనియన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందమూరు నారాయణరెడ్డి, మైనార్టీ నేత చాంద్‌బాషా, గోరకాటి పురుషోత్తంరెడ్డి, పెనుజూరు నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, సాదిక్‌వలి, జాకీర్, సుబహాన్‌బాషా, దంపెట్ల వలి, జిలాన్‌బాషా, నాటి ఖలీల్, ఫయాజ్, షబ్బీర్, జావేద్, మహబూబ్‌బాషా, నూరు, గుండా ఈశ్వరయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో మానవాళి మనుగడకు ముప్పు



తనకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది



తాడిమర్రిలో దుకాణదారులకు ప్లాస్టిక్ వినియోగంపై నోటీసులు ఇస్తున్న అధికారులు

సాక్షి బృందం: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో మానవాళి మనుగడకు పెనుముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కూరుకుపోయి మట్టిని కలుషితం చేస్తాయన్నారు. అలాగే వీటివల్ల పర్యావరణం దెబ్బతింటుందని వివరించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారిపై కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ప్లాస్టిక్ నిర్మూలన కోసం పాటుపడతామని అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

మైదుగోళంలో కార్డెన్ సెర్చ్

లేపాక్షి: మండలంలోని మైదుగోళంలో శనివారం హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అక్రమ కర్ణాటక మద్యం, ఇసుక, మట్టి, పేకాట, దొంగతనాలు, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయతీ కేంద్రంలో శనివారం ఉదయం సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో పర్యటించి పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాట్కా, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా, కర్ణాటక మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ కలసి మెలసి జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

డబ్బు కాజేసిన వారిపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల డబ్బు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 220 మందికి చెందిన రూ.13,32,743 సొమ్మును కార్యాలయంలో చెల్లించకుండా టీఎల్ఎఫ్ గ్రూప్ వద్దనే పెట్టుకున్నట్లు తెలిపారు. అందులో నుంచి రూ.4,94,000లను చెక్కు రూపంలో గురునాథ్ అనే మేస్త్రీ అకౌంట్‌లోకి గుట్టుచప్పుడు కాకుండా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై కనీసం విచారణ కూడా చేయలేదని మండిపడ్డారు. పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిద్దగిరి సురేష్, హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజా బేగం

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజా బేగం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు ల్యాబ్, కాన్పుల గది, వార్డును, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఆర్. రామాపురం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వంట గది, హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పాఠశాలలో జరుగుతున్న హెచ్‌బీ టెస్ట్ స్క్రీనింగ్‌ను తనిఖీ చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి, సీహెచ్‌ఓ రామాంజులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు అభినందనల వెల్లువ



రామాపురం పాఠశాలలో విద్యార్థినులతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో శుక్రవారం ముగిసిన క్రికెట్ టోర్నీలో విజయం సాధించిన రామాపురం, మాల్యవంతం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం రామాపురం ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాముడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందలు తెలియజేశారు. రామాపురంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులను స్కూల్ కమిటీ చైర్మన్ సుజాత, చంద్రబాబు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అహ్మద్‌జాన్, వరదరాజులు, శ్రీదేవి, పుష్పలత, షాహినా సుల్తానా బేగం, ప్రమీల, కామాక్షి, పద్మావతి, సుమలత, బాలాజీ, నాగమల్లేసు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాల్యవంతం ఉన్నత పాఠశాల బాల, బాలికలు విద్యార్థులు రన్నర్స్‌గా నిలవడంతో వారిని హెచ్ఎం చెన్నకృష్ణారెడ్డి, ఉపాధ్యాయలు అభినందించారు. పీడీ నాగరాజు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రమ్స్ వితరణ



డ్రమ్స్ అందిస్తున్న దృశ్యం

నల్లచెరువు: స్థానిక పీర్ల చావిడికి మండల కేంద్రానికి చెందిన హోటల్ రామ్ ప్రసాద్ శనివారం డ్రమ్స్ ఇతర వస్తువులను వితరణ చేశారు. ఏటా మండల కేంద్రంలో మొహర్రం పండుగకు ఉపయోగపడేలా డ్రమ్స్ అందించామని దాత తెలియజేశారు.

పీరు, వెండి గొడుగులు అందజేత



పిన్నదరి గ్రామస్తులకు మౌలాలి పీరును అందిస్తున్న దాతలు

తాడిమర్రి: పిన్నదరి గ్రామంలోని పీర్ల చావిడికి అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన బారెడ్డి మల్లిరెడ్డి కుమారుడు బారెడ్డి రామిరెడ్డి ఆయన సతీమణి బారెడ్డి అంజనమ్మ, వెండి పీరు, ఐదు వెండి గొడుగులను వితరణ చేశారు. సుమారు రూ.4.50 లక్షల విలువ చేసే మౌలాలి అనే పీరు, ఐదు గొడుగులను శనివారం వారు పిన్నదరిలోని పీర్ల చావిడిలో గ్రామ పెద్దలు, పీర్ల చావిడి పెద్దలు అయిన మాజీ సర్పంచ్ కేశవనారాయణ, బోనే తిరుపాల్ నాయుడు, సత్యనారాయణరెడ్డికి అందించారు. మొక్కుబడి ఉండటంతో పీరును వితరణ చేసినట్లు దాతలు తెలిపారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు



విద్యార్థినులతో సమస్యలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం రూరల్: విద్యార్థినులకు వసతులను కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆర్డీఓ మహేష్ కస్తూర్బా పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం మోటుమర్ల వద్దనున్న కస్తూర్బా పాఠశాలను ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో సమస్యలపై ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన వారికి సూచించారు. ఉత్తమ విద్యను అందించాలని, వచ్చే సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు మరింత మెరుగుపడాలని ఆయన సిబ్బందికి సూచించారు. హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.